క్లుప్తంగా

సింహవాహనంపై బుగ్గ వేంకటేశ్వరుడు



సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో వెలసిన బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత బుగ్గ వేంకటేశ్వర స్వామి బుధవారం సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ చంద్రుడు, అర్చకుడు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

బేతంచెర్ల: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ డిమాండు చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా ఇష్టారాజ్యంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ప్రదీప్, గణేష్, మనోహర్, మధు కృష్ణ, రమేష్, మహేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

కోవెలకుంట్ల: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కాగా ఆయా ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. సాధారణ, మధ్యతరగతి ప్రజల అమయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం పాఠ్యపుస్తకాలు, యూనిఫాం తదితర రూపంలో పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం మంది పేద విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పాలనే జీఓ ఉన్నా కొన్ని చోట్ల పాటించడం లేదని విమర్శించారు. జిల్లావిద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి ఫీజుల దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేశారు.

కొత్తగా 76 మంది విద్యార్థులకు అడ్మిషన్లు



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ వెంకటసుబ్బయ్య

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 76 మంది విద్యార్థులు వివిధ తరగతుల్లో కొత్తగా అడ్మిషన్లు పొందినట్లు ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య తెలిపారు. కొత్తగా చేరిన విద్యార్థులకు బుధవారం పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 68 మంది 6వ తరగతి, నలుగురు ఎనిదవ తరగతి, నలుగురు తొమ్మిదవ తరగతిలో చేరారన్నారు. ఆరు నుంచి పదవ తరగతికి సంబంధించి ఇప్పటి వరకు పాఠశాలలో652 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజయ్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మూడు మండలాల పరిధిలో కేంద్రం బృందం గురువారం పర్యటించనుంది. గతుడాది రబీ సీజన్‌లో వర్షాభావంతో పంట నష్టం జరిగింది. కరువు నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేసేందుకు కేంద్రబృందం పర్యటిస్తోంది. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలం భీమునిపాడు, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలం హరివరం గ్రామాల్లో అధికారులు పర్యటించి బాధిత రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు.

ఆరుగురు బైండోవర్

అవుకు: మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ఆరుగురిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ బాబు తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలుగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మండల కేంద్రం అవుకుకు చెందిన ఈడిగ మధుసూదన్ గౌడ్, దాది ప్రసాద్, కట్టెల ఆదిశేషు, ఏదుల శివశంకర్, వేములపాడుకు చెందిన పసుపల వేణుగోపాల్, శింగనపల్లెకు చెందిన భీమునిపాటి రాజును మండల రెవెన్యూ అధికారి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ వివరించారు.

ఆశాజనకంగా వర్షాలు

కోవెలకుంట్ల: నైరుతి రుతుపవనాల ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. బుధవారం సబ్ డివిజన్‌లోని దొర్నిపాడు మండలంలో 19.2 మి.మీ., కోవెలకుంట్ల- 15.8 మి.మీ., అవుకు మండలంలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు వర్షాలు అనుకూలంగా మారడంలో సీజన్ అన్ని విధాలా కలిసొస్తుందని రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.

నాటి బేతాళపురమే...నేటి బేతంచెర్ల

- 18వ శాతాబ్దంలో పాలించిన బేతాళరాజు
- నాటి చరిత్రకు సాక్ష్యంగా కోట ముఖ ద్వారం, బురుజు




బేతంచెర్ల పట్టణం వ్యూ

బేతంచెర్ల: ఒక్కో గ్రామానికి ఒక్కో చారిత్రక నేపథ్యం ఉంటుంది. ఈ కోవలోనే పూర్వం ప్రస్తుతం ఉన్న బేతంచెర్ల పట్టణాన్ని బేతాళ రాజు పరిపాలించినట్లు చరిత్ర. బేతాళపురంగా పిలుస్తూ కాల క్రమేణా బ్రిటిష్ హయంలో బేతంచెర్లగా మారిపోయింది. చారిత్రక నేపథ్యం ఆధారంగా 18వ శతాబ్దంలో బేతళరాజు పరిపాలించినట్లు తెలుస్తోంది. పూర్వం గద్వాల పట్టణాన్ని సోమనాథుడు అనే రాజు పరిపాలిస్తున్న కాలంలో విభేదాలు తలెత్తాయి. శత్రు రాజులు గద్వాలను ముట్టడించి రాజవంశాన్ని కడతేర్చందుకు సిద్ధమయ్యారు. కోట గోడను బద్దలు గొట్టేందుకు ప్రయత్నిస్తుండగా వేగువాడి సమాచారం మేరకు సోమనాథుడు రాజు తన భార్య,పిల్లలను రహస్య మార్గంలో సురక్షిత ప్రాంతానికి తరలించాడు. అక్కడ నుంచి ఆయన పంచకళ్యాణి అనే అశ్వంపై రహస్య ద్వారం గుండా ప్రసుత్తం ముచ్చట్లగా పరిగణించబడే ప్రాంతానికి వచ్చినట్లు చరిత్ర. అప్పట్లో ఈ ప్రాంతమంతా అడవి, సెలయేరు మాత్రం ఉండేది. అలసిపోయిన రాజు విశ్రాంతి తీసుకోవడానికి తగిన చోటును వెదకసాగాడు. ఇలా ఉండగా ఒక మేక పిల్లను తోడేలు వెంటాడుతూ వచ్చింది. మేక పిల్ల గుంతలో పడిపోగా తోడేలు భయపెడుతూనే ఉంది. గమనించిన రాజు మేకపిల్లను రక్షించేందుకు ఓ కర్రను తోడేలుపై విసిరాడు. దీంతో గుంతలో ఉన్న మేకపిల్ల ఉదుటున ఎగిరి పరిగెత్తుతూ ప్రసుత్తం బేతంచెర్ల వైపు దేవుని బావిగా పిలవడే ప్రాంతానికి చేరుకుంది. వెంబడించిన తోడేలుపై మేకపిల్ల తిరుగబడింది. దీంతో తోడేలు వెనుతిరగడాన్ని గమనించిన రాజు ఆశ్చర్యానికి గురయ్యాడు. ఆ ప్రాంతానికి ఏదో మహిమ ఉందని భావించిన రాజు అక్కడే స్థిరపడేందుకు నిశ్చయించుకున్నాడు. అప్పట్లో 12 సంవత్సరాలు కరువు రావడంతో ఇక్కడికి వచ్చిన ప్రజలకు ఆశ్రయం కల్పించేందుకు ఆ ప్రాంతం అంతా చదును చేయించారు. అదేవిధంగా కందకం తవ్వించి, కోట గోడలు నిర్మించి బేతాళపురం రాజ్యంగా తన కుమారుడి పేరును నామకరణం చేశారు. కాలక్రమేణా బేతాళపురం, బేతంచెర్లగా రూపుదిద్దుకుంది.

చెక్కుచెదరని కట్టడాలు

గ్రామంలో ఉన్న కోటపేట ముందు ఉన్న ముఖ ద్వారము నాటి చారిత్రక కట్టడానికి నిదర్శంగా నిలుస్తొంది. నేటికి చెక్కు చెదరకుండా ఉన్న ముఖ ద్వారం నాటి శిల్పుల నైపుణ్యానికి సాక్ష్యంగా నిలుస్తోంది. కోటపేట, డ్రైవర్స్ కాలనీ మధ్యలో ఉన్న కందకం శత్రువుల భారీ నుండి రక్షించుకోవడానికి నాడు తవ్వినట్లు చరిత్ర ఆధారంగా తెలుస్తోంది. అలాగే ప్రస్తుతం గౌరిపేట కాలనీల్లో ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయం బేతలరాజు హయంలో నిర్మించినట్లు పూర్వికుల కథనం. అదేవిధంగా దక్షిణ భాగానున్న ముచ్చట్ల మల్లికార్జున స్వామి, తూర్పున కొండపైన ఉన్న గట్ల నరసింహస్వామి ఆలయాన్ని సైతం ఆ రాజు హయంలో ఉన్నట్లు తెలుస్తోంది. పట్టణంలో పూదోట మఠం, బోయపేట, రైల్వే స్టేషన్ సమీపాన, దుర్గాపేట, బనగానపల్లె రహదారిలోని శివలింగాలు ఒకే ఆకారంలో ఉండటం విశేషం. వీటన్నింటిని బేతల రాజు హయంలో ప్రతిష్ఠ చేసినట్లు తెలుస్తోంది. దక్షిణాదిన రంగురాళ్లకు ప్రసిద్ధి కెక్కిన బేతంచెర్లకు చారిత్రక నేపథ్యంతోపాటు పారిశ్రామిక కేంద్రంగా అభివద్ధి చెందింది.



నాటి రాజుల చరిత్రకు ఆధారంగా చెక్కు చెదరని కోటపేట ముఖద్వారం

బేతాళరాజు హయంలోనే గుడి నిర్మాణం



చరిత్ర ఆధారంగా 18వ శతాబ్దంలోనే గద్వాల రాజు సోమనాథుడు కుమారుడు బేతాలరాజు ఈ ప్రాంతాన్ని పరిపాలించినట్లు చారిత్రక ఆధారంగా తెలుస్తోంది. బేతాళరాజు హయంలోనే అంజనేయ, చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణం జరిగినట్లు రికార్డుల ఆధారంగా తెలుస్తుంది.

– రామూర్తి శర్మ, వేంకటేశ్వరస్వామి ఆలయ పూజారి

నాటి కళానైపుణ్యానికి నిదర్శనం కోట ముఖ ద్వారం



నాటి కళానైపుణ్యానికి నిదర్శనంగా కోటపేట కోట ముఖద్వారం దర్శనమిస్తోంది. నాడు కోటపేట సమీపాన శత్రు రాజుల రక్షణ కోసం కందకం తవ్వడమే కాకుండా, రాతి కట్టడాలు నిర్మించారు. కాలక్రమేణా కోట బురుజులు కూలిపోగా, కందకం మాత్రం అలాగే ఉంది.

– హుసేన్‌రెడ్డి, బేతంచెర్ల



కోటపేటలోని కోట బురుజు

ఆటో నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే కోట్ల



ఆటోనగర్ ప్రజలతో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

డోన్ టౌన్ : పట్టణంలోని ఆటో నగర్‌లో ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. రోడ్లు, మురుగు కాల్వలు తదితర సమస్యలు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, సచివాలయం సిబ్బంది, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె రూరల్ : వర్షాకాలంలో పశువులు, జీవాల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై పశుసంవర్ధకశాఖ సహాయకులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ మారుతిసకారం సూచించారు. బుధవారం స్థానిక పశువైద్యశాలలో బనగానపల్లె, అవుకు మండలాల్లోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహించే పశుసంవర్ధకశాఖ సహాయకులకు మూగజీవాలకు సోకే సీజన్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వర్షాకాలంలో తొలకరి చినుకుల కారణంగా మూగజీవాలకు ఎలాంటి రోగాలు సోకకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షా కాలంలో పశువుల్లో గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వ్యాధులు సోకేప్రమాదం ఉందని, మూగజీవాలకు సకాలంలో టీకాలు వేయాలన్నారు. ఆ దిశగా పశుపోషకులు, గొర్రెలు, మేకల కాపరులను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ భారతీ దేవి, ఐశ్వర్య, రామ్‌కుమార్‌రెడ్డి, బ్రహ్మనందరెడ్డి, బైరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు,ఉపాధ్యాయిలు



ర్యాలీలో పాల్గొన్న ఏంఈఓ ఈశ్వరయ్య

కొలిమిగుండ్ల: బడి ఈడు పిల్లలందరూ తప్పక బడిలో ఉండాలని ఎంఈఓ అబ్దుల్‌కలాం పేర్కొన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బుధవారం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలను తప్పక పాఠశాలలకు పంపాలని సూచించారు.

ప్రతి పిల్లావాడు బడికి వెళ్లాలి

సంజామల: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, ప్రతి పిల్లవాడు బడికి వెళ్లేలా తల్లితండ్రులు చొరవ చూపాలని ఎంఈఓ ఈశ్వరయ్య సూచించారు. బుధవారం పేరుసోముల గ్రామంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా పేరుసోముల స్కూల్ హెచ్ఎం శీతరావమ్మతో కలసి ఎంఈఓ ఈశ్వరయ్య స్కూల్ నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ మాట్లడుతూ విద్యాహక్కు చట్టం నిబంధనలు అందరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ బాషా, వ్యాయమ ఉపాధ్యాయుడు ప్రతాప్ తదితురలు పాల్గొన్నారు.

ప్యాపిలి: బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలోనే ఉండాలని మెట్టుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రవీంద్రగుప్త అన్నారు. మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామంలో బుధవారం 'నేను బడికిపోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నపరెడ్డి, రమాదేవి, శివ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రాయల్టీల మంజూరులో జాప్యం

కొలిమిగుండ్ల: భూగర్భ గనుల శాఖకు సంబంధించి ఆన్‌లైన్ రాయల్టీల మంజూరులో జాప్యం చోటు చేసుకుంటుంది. కొలిమిగుండ్ల మండలంలో నాపరాతి గనులు అధికంగా ఉన్నాయి. ఇక్కడ గనుల్లోంచి వెలికితీసిన నాపరాళ్లను ట్రాక్టర్లు, లారీల్లో ఎగుమతి చేసేందుకు తప్పక రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. బందార్లపల్లె క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన రాయల్టీ తనిఖీ కేంద్రంలో చెక్ చేసిన తర్వాత వాహనాలు వెళ్లాల్సి ఉంటుంది. ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో రాయల్టీల జారీ ప్రక్రియను నిలిపివేశారు. మైనింగ్ యజమానులు పర్మిట్ల కోసం ఆన్‌లైన్‌లో ప్రయత్నించినా వెబ్‌సైట్ పని చేయడం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో వెబ్‌సైట్‌లో మార్పులు, చేర్పుల కోసం నిలిపివేసినట్లు తెలుస్తుంది. రాయల్టీ చెక్‌పోస్టు మీదుగా రోజుకు 400 ట్రాక్టర్లు, 50కిపైగానే లారీలు నాపరాళ్లను ఎగుమతి చేస్తుంటారు. నాలుగు రోజులుగా ఆన్‌లైన్ రాయల్టీలు అందుబాటులో లేక పోవడంతో యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన



మాట్లాడుతున్న మలేరియా అధికారి కేశవరావు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని గ్రామ సచివాలయం–1లో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఎస్ కేశవరావు మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఎక్కువగా బాలికలు, మహిళాల్లో వస్తుందన్నారు. యువతీ,యువకులు వివాహాలకు ముందు రక్తపరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధి లక్షణాలు తెలుసుకొవచ్చొన్నారు. ఇది వంశ పరంపరగా వ్యాపిస్తోందని, సకాలంలో పరీక్షలు చేయించుకొని వైద్య సేవలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రత్నకుమారి, ఏఎన్ఎం శివమ్మ, సీహెచ్ఎం భవానీ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అవుకు: మండల కేంద్రం అవుకులో సికిల్ సిల్ ఎనీమియా వ్యాధిపై ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్లు వినోద్ కుమార్, యమునా బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఈ వ్యాధి జన్యు లోపంతో వస్తుందని, రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తి లోపం ఉంటుందని తెలిపారు. ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన ప్రాంతాల ప్రజల్లో ఉంటుందన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి నిర్ధారణ అయితే హయ్యర్ ఇన్‌స్ట్యూషన్స్‌కు రెఫర్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్, మండల పరిపాలనాధికారి వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు వేణుగోపాలరాజు, దానమ్మ, సిహెచ్ఓలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల ఎస్‌టీ కాలనీలో డాక్టర్ జయ భరత్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించి రక్త పరీక్షలు చేశారు. ఆకుమల్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ జయ భారత్ రెడ్డి మాట్లాడుతూ ఎనీమియా వ్యాధి వచ్చిన వారి ఎర్రరక్తకణాలు గుండ్రంగా కాకుండా అర్ధ చంద్రాకారంలో ఉంటాయన్నారు. దీంతో తీవ్రమైన కీళ్లనొప్పులు, శ్వాస కోశ వ్యాధులు, అలసట లక్షణాలు ఉంటాయన్నారు. నలభైఏళ్లలోపు వ్యక్తులు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలోప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షణ అధికారి సుబ్బరాజు, సూపర్‌వైజర్ తెరిసమ్మ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి

బేతంచెర్ల: తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు ఇష్టంతో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల ప్రైవేట్ స్కూలు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విజయనాగరాజు, రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండా గోపాల్ అన్నారు. బుధవారం పట్టణంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో ఈఏడాది 10వ తరగతిలో 574 మార్కులు సాధించిన విద్యార్థిని మానసకు రూ. 5వేల నగదు బహుమతి అందజేసి అభినందించారు. అలాగే 1990–91 బ్యాచ్ శేషారెడ్డి హైస్కూలు పూర్వ విద్యార్థి నరసింహానాయుడు గణితంలో ఉత్తమ మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు రూ. 3వేల ప్రోత్సాహ నగదు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబిదా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వేలం పాటలు

ప్యాపిలి: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఈఓ శివ ప్రసాద్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలోని వారపుసంత మార్కెట్, దిన కూరగాయల మార్కెట్, బస్టాండ్ పరిధిలోని దుకాణాలు, మాంసపు మార్కెట్‌కు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనేందుకు రూ. 6,50,000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉదయం 11 గంటలకు వేలం పాటలు ప్రారంభం అవుతాయన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కైలాస్

డోన్ టౌన్ : లంబాడీ హక్కుల సాధన కోసం జూలై 1వ తేదీన చేపట్టిన హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ గోర్ బంజార సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కైలాస్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో బుధవారం ఆల్ ఇండియా బంజార సేవా సంఘ్ జిల్లా నాయకులు కృష్ణనాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మా తాండలో మా రాజ్యం, మేము ఎంత మందిమో మాకు అంతవాట అనే నినాదంతో లంబాడీ హక్కుల సాధనకు చలో హైదరాబాద్ కార్యక్రమం ద్వారా గోర్ బంజార సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నాగరాజు నాయక్, నాయకులు శంకర్‌నాయక్, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గ్రేసమ్మ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్ : మండలంలోని ఎద్దుపెంట పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన గ్రేసమ్మను బుధవారం స్థానిక షాదీఖానాలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. మండల విద్యాధికారి–2 రామనర్సప్ప, బేతంచెర్ల మండల విద్యాధికారి సోమశేఖర్, ఉపాధ్యాయులు, స్నేహితులు గ్రేసమ్మ దంపతులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



గుణామృతకు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: 2023–24 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తేగులపల్లి అచ్చమ్మ సేవా సదనం ఆధ్వర్యంలో బుధవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కోవెలకుంట్లకు చెందిన రిటైర్డ్ హెచ్ఎం దివంగత నాట్ల సుబ్బారెడ్డి, నాట్ల సుబ్బమ్మ జ్ఞాపకార్థం ఆ సంస్థ ప్రతి ఏటా పేద విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తోంది. ఈ ఏడాది పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ బాలికోన్నత, మండలంలోని రేవనూరు, సంజామల మండలం ఆకుమల్ల, సంజామల జెడ్పీ పాఠశాలలతోపాటు వైఎస్సార్ కడప జిల్లా పెద్దముడియం మండలం గుల్లకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులను సత్కరించి ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ఒక్కో పాఠశాలలో ఎక్కువ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ. 15వేలు, రూ. 10 వేలు, రూ. 5వేల ప్రకారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, సేవాసదనం ప్రతినిధులు వాసుదేవరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నాట్ల వెంకటేశ్వరరెడ్డి, వై. రమేష్‌రెడ్డి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు రాజయ్య, అరుణ కుమారి, రిటైర్డ్ హెచ్ఎం జీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రామపంచాయతీ పనుల వేలం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూర్చే వివిధ పనుల నిర్వహణకు బుధవారం నిర్వహించిన వేలంపాట ప్రశాంతంగా ముగిసింది. ప్రతి ఏటా మార్చిలో వేలం పాట జరుపుతుండగా ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు నెలలు ఆలస్యంగా చేపట్టారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఉన్న తొమ్మిది నెలలకు సంబంధించి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓపీఆర్‌డీ రాధిక ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో సంతమార్కెట్ నిర్వహణ పనులను పట్టణానికి చెందిన శ్రీనివాసులు రూ. 15.21 లక్షలకు దక్కించుకున్నాడు. దిన మార్కెట్ పనులను కె. వెంకటేశ్వర్లు రూ.6.46 లక్షలకు, బస్టాండ్‌పనులను ఎస్ఎస్ శ్రీనివాసులు రూ. 6.52 లక్షలకు, కమేళాను ఫజుల్ రూ. 7,500 వేలం పాటపాడి కై వసం చేసుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వేలంపాట ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం తగ్గింది. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఈఓ గోపినాథ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

బేతంచెర్ల: ఛత్రపతి శివాజీని యువత ఆదర్శంగా తీసుకొని దేశ పురోగతి, పరిరక్షణకు పాటుపడాలని హిందూ సోదరులు నాగ మోహన్ రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలో హిందూ సామ్రాజ్యదినోత్సవం సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని హిందూ సోదరులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పూలమాలలు వేశారు. ఈసందర్భంగా వారు ఛత్రపతి శివాజీ త్యాగాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో హిందూ సోదరులు రమణ, శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, మనికంఠ, అజయ్ పాల్గొన్నారు.

ఉద్యాన సాగుపై అవగాహన కల్పించాలి

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగమైన ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఏపీఓ శ్రీవిద్య సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి పథకం కార్యాలయంలో మండలంలోని టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం వందశాతం సబ్సిడీ వర్తింపచేస్తోందన్నారు. మామిడి, చీని, నిమ్మ, దానిమ్మ, సపోట, జామ, కొబ్బరి పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి కూలీలకు ప్రభుత్వం రూ. 300 గరిష్ఠ వేతనం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో ఈసీ మగ్బుల్, టెక్నికల్ అసిస్టెంట్లు జయభారత్‌రెడ్డి, పక్కృద్దీన్, రాధాదేవి, ప్రసాదరెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు శేబా రాణి కోరారు. బుధవారం పట్టణంలోని సీఐటీయు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నలభై ఏళ్లుగా సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు గుల్జార్ బీ, రాజేశ్వరీ, మధురవాణి, మహాలక్ష్మి, అనూష, అరుణ, నారాయణమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల వేలంపాట

సంజామల: మండల పరిధిలోని వసంతాపురం గ్రామానికి చెందిన చెన్నకేశవ స్వామి, ఆంజనేయ స్వామి దేవాలయానికి చెందిన భూములు ఏడాది కౌలు సాగుకు బుధవారం దేవదాయశాఖ కార్యనిర్వహనాధికారి చంద్రుడు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. మొత్తం 26.46 ఎకరాలు రూ.4.22 లక్షలకు వేలంపాడి రైతులు దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే రూ.2 లక్షలు ఆదాయం దగ్గిందన్నారు. కార్యక్రమంలో దేవాలయాల ఇన్‌స్పెక్టర్ నరసయ్య, అర్చకుడు సత్యమయ్య తదితరులు పాల్గొన్నారు.